



దేవదాయశాఖలో దొంగల రాజ్యం!

దేవదాయశాఖలో దొంగల రాజ్యం నడుస్తోంది. ఆలయాల ఆస్తులు అక్రమార్కుల పరమవుతున్నాయి. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు చెప్పిందే శాసనంగా సాగింది. వారికి తలొగ్గిన దేవదాయశాఖ అధికారులు అక్రమాలకు లాకులెత్తారు. అంతా కలిసి దేవదాయ భూములను కొల్లగొట్టేశారు. ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలను పక్కనపెట్టి అధికారులు తమ ఆదాయం కోసం అడ్డదారులు తొక్కారు. బందరులోని పలు ఆలయాల వ్యవహారంలో జరిగిన అక్రమమే ఇందుకు నిదర్శనం. ఈ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. చర్యలకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఆ అక్రమాల కథేంటో చదవండి.

- బందరు రంగడి, రామలింగేశ్వరస్వామి ఆలయాల ఆస్తులపై అక్రమార్కుల కన్ను
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని అడ్డుకునే యత్నం
- వైసీపీ నేతలతో కొందరు వ్యాపారుల కుమ్మక్కు
- నిర్మాణలను అడ్డుకునేందుకు వేలం ఎత్తుగడ
- ఉన్న షాపుల కొనసాగింపునకు 11న వేలం
- నోటీసులు జారీ చేసిన అధికారులు
- 28 ఆలయాలు ఒక అధికారి చేతిలోనే
- చల్లరాస్తా సెంటరులో సత్రం అమ్మకం
- అక్రమాలకు అధికారుల సహకారం
- చర్యలకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం

షాపులకు 11న వేలం

"రంగడి, రామలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన స్థలంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్, చుట్టూ రహదారి నిర్మాణం కోసం ఏడాది క్రితమే అనుమతులు వచ్చాయి. కానీ పనులు ప్రారంభించలేదు. ఈలోగా కొన్ని షాపుల లీజు గడువు ముగుస్తుండటంతో ఈనెల 11వ తేదీన షాపుల వేలానికి నోటీసులు జారీ చేశాం"

- సుబ్బారెడ్డి, రంగడి ఆలయ ఈవో

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం నడిబొడ్డున కోనేరు సెంటరుకు అత్యంత సమీపంలో రంగడిగుడి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు పక్కపక్కనే ఉంటాయి. 4.70 ఎకరాల విస్తీర్ణం ఉంటే రెండెకరాల్లో రెండు ఆలయాలున్నాయి. మరో 2.70 ఎకరాల్లో 160కిపైగా షాపులున్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.80 లక్షలకుపైగా ఆదాయం వస్తోంది. పురాతనకాలంలో నిర్మాణం చేసిన ఈ షాపులను తొలగించి ఆధునాతన పద్ధతిలో రెండు, మూడు అంతస్తుల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏడాది క్రితం దేవదాయశాఖ ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ చుట్టూ సిమెంటు రహదారిని రూ.2 కోట్లతో నిర్మించేందుకు అధికారులు అంచనాలు రూపొందించారు. ప్రభుత్వ అనుమతులు కూడా వచ్చాయి. ఉన్న షాపులను తొలగించడమే మిగిలింది.

● కుయుక్తులతో అడ్డుకుని..

షాపులను తొలగించకుండా అడ్డుకునేందుకు గత పాలకుల, షాపుల నిర్వాహకులు కుయుక్తులు పన్నారు. దేవదాయశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయకుండా తతంగం నడిపారు. రెండు ఆలయాలను, షాపింగ్ కాంప్లెక్స్‌ను కలుపుతూ రహదారి నిర్మాణం జరిగే ప్రాంతంలోని షాపుల లీజుకు ఈనెల 11వ తేదీన వేలం చేసేందుకు నోటీసులు జారీ చేయించారు. తొలగించాల్సిన షాపులకు వేలంపాట నిర్వహణకు నోటీసులు జారీచేయడంతో తెరవెనుక ఏదో జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రంగడి, రామలింగేశ్వరస్వామి ఆలయాల స్థలంలోని దుకాణాలు

28 ఆలయాలకు ఒక్కరే ఈవో

బందరుతోపాటు గూడూరు, పెడన మండలాల్లో దేవదాయశాఖ పరిధిలోకొచ్చే ఆలయాలు 28 ఉన్నాయి. దేవదాయ అధికారులను తనదారిలోకి తెచ్చుకున్న అధికారి ఒకరు ఈ 28 ఆలయాలకు తానే పరిపాలనాధికారిగా ఉన్నారు.

మరికొన్ని అక్రమాలు ఇవిగో..

- గూడూరు మండలం తరకటూరులోని విశ్వేశ్వరస్వామి ఆలయానికి ఎకరం ఉంది. గతనెలలో ఈ భూమి నుంచి 100 ట్రక్కులకు పైగా మట్టి తవ్వి విక్రయించేశారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.
- మచిలీపట్నంలోని చల్లరాస్తా సెంటరులో టి.పిచ్చయ్య అనే పేరుతో సత్రం ఉంది. పట్టణంలో అద్దె గృహాల్లో నివసించే కుటుంబాల్లోని సభ్యులు ఎవరైనా చనిపోతే ఈ సత్రంలో కర్మకాండలు జరుపుకునేందుకు దీనిని వాడుకునేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సత్రం స్థలాన్ని మూడు విడతల్లో విక్రయించేశారు. అయినా అధికారులు ఆ వైపునకు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సత్రం స్థలం అక్రమ విక్రయం అంశంపై తగు చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.

మరో ఏడాది..!

తప్పని రైళ్ల రద్దు.. ప్రయాణికులకు ఇక్కట్లు

- విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో పనుల వల్లే..
- ఇప్పటికే భారీగా రైళ్లను రద్దు చేసిన అధికారులు
- వచ్చే మార్చి వరకూ తప్పదని వెల్లడి
- వాస్తవానికి అంత అవసరం లేదు..!
- అయినా ఇష్టానుసారంగా నిర్ణయాలు
- వందేభారత్ రైళ్లకు మాత్రం మినహాయింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో ఆటోమేటిక్ సిగ్నలింగ్, ట్రాక్ మెయింటెనెన్స్ పనులు వచ్చే ఏడాది అంటే.. 2025-మార్చి వరకు జరుగుతాయి. ఇది రైల్వే అధికారుల ప్రాథమిక అంచనా మాత్రమే. ఈ సమయం మరింత పెరిగే అవకాశం ఉందే తప్ప, తగ్గే అవకాశమైతే లేదు. కాబట్టి అత్యవసర ప్రయాణాలు చేసేవారు రైళ్లను నమ్ముకుంటే ఇబ్బందుల్లో పడతారు. విజయవాడ-దువ్వాడ సెక్షన్ మొత్తం 330 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గంలో ఆటోమేటిక్ సిగ్నలింగ్, ట్రాక్ మెయింటెనెన్స్ పనులను రైల్వే అధికారులు ప్రారంభించారు. కానీ, ఈ పనులు చేయడానికి భారీ సంఖ్యలో రైళ్లను రద్దు చేయాల్సిన అవసరం లేదు. ఇక ఈ రైళ్ల రద్దులో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.

ఏడాది పాటు ఆటోమేటిక్ సిగ్నలింగ్ పనులు

విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో మనుషులతో సంబంధం లేకుండా ఆటోమేటిక్ సిగ్నలింగ్ విధానాన్ని అభివృద్ధి చేయాలని రైల్వే నిర్ణయించింది. మొత్తం 330 కిలోమీటర్లలో ఆరు నెలలుగా 55 కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ సిగ్నలింగ్ పనులు చేపట్టారు. మిగిలిన 275 కిలోమీటర్లలో పనులు చేపట్టాలంటే కనీసం వచ్చే మార్చి వరకూ సమయం పడుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఆటోమేటిక్ సిగ్నలింగ్ వల్ల ఈ సెక్షన్‌లో మరింత వేగంగా, సమర్థవంతంగా, భారీ సంఖ్యలో రైళ్లను నిరంతరాయంగా నడపవచ్చంటున్నారు.

విజయవాడ-గూడూరు మూడోలైన్ కమిషన్ పనులు

విజయవాడ డివిజన్ పరిధిలో బెజవాడ-గూడూరు మూడోలైన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంకా 85 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ కారణంగా గూడూరు వైపు వెళ్లే రైళ్లను కూడా రద్దు చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టుకు విజయవాడ-రాయనపాడు మధ్య థర్డ్‌లైన్ కమిషన్ పనులు పూర్తవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.



'దయచేసి వినండి.. మీకు అత్యవసర ప్రయాణాలుంటే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోండి.. ఎందుకంటే మరో ఏడాది పాటు భారీగా రైళ్లు రద్దవుతూనే ఉంటాయి. ఎప్పుడు ఏ రైలు రద్దవుతుందో తెలియని పరిస్థితి. ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నా సరే.. ఏ క్షణంలో ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు.' ఆటోమేటిక్ సిగ్నలింగ్, ట్రాక్ మెయింటెనెన్స్ పనుల పేరిట ఇప్పటికే చాలా రైళ్లను రద్దు చేసిన అధికారులు ఇదే పరిస్థితి మార్చి వరకూ ఉంటుందని చెబుతున్నారు. వందేభారత్ రైళ్లకు మాత్రం ఈ రద్దులో మినహాయింపు ఇవ్వడం కొసమెరుపు.

అసంపూర్తిగా మెయింటెనెన్స్ పనులు

విజయవాడ-విశాఖపట్నం సెక్షన్‌లో మెయింటెనెన్స్ పనులు ఎప్పటినుంచో జరుగుతున్నాయి. పలుచోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. విజయవాడ- నిడదవోలు మధ్య 4.98 కిలోమీటర్లు, నిడదవోలు- సామర్లకోట 4.10 కిలోమీటర్లు, సామర్లకోట-దువ్వాడ 5.52 కిలోమీటర్ల మేర మొత్తం 14.61 కిలోమీటర్ల మేర పూర్తి చేయాల్సి ఉంది. ట్రాక్ మెయింటెనెన్స్ పనుల్లో కొంత పురోగతి ఉంది. నిడదవోలు-సామర్లకోట 39.61 కిలోమీటర్లు, సామర్లకోట-దువ్వాడ 27.40 కిలోమీటర్లు వెరసి 67.02 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశారు. అలాగే, ఇదే సెక్షన్‌లో డీప్ స్క్రీనింగ్ పనులు కూడా చేపట్టాల్సి ఉంది. విజయవాడ- నిడదవోలు 11.05 కిలోమీటర్లు, నిడదవోలు- సామర్లకోట 27.87 కిలోమీటర్లు, సామర్లకోట-దువ్వాడ 42.51 కిలోమీటర్ల మేర మొత్తంగా 81.89 కిలోమీటర్ల మేర చేపట్టాల్సి ఉంది.

విజయదుందుభి!

2023-24లో 12 కోట్ల లీటర్ల పాల సేకరణ
5 ఏళ్లలో 3 రెట్లు పెరిగిన లాభాలు
ఓ వైపు అమూల్.. మరో వైపు వైసీపీ ప్రతికూలతలను అధిగమించి ముందుకు



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతిపెద్ద కో-ఆపరేటివ్‌గా కృష్ణా మిల్క్ యూనియన్‌గా ఉన్న కృష్ణా మిల్క్ యూనియన్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు 12 కోట్ల లీటర్ల పాలసేకరణతో రికార్డు నెలకొల్పింది. యూనియన్ ఆవిర్భవించిన తర్వాత ఈ స్థాయిలో పాల సేకరణ జరగడం ఇదే రికార్డుగా చెబుతున్నారు. గడిచిన ఐదేళ్లగా ఎన్ని ప్రతికూల పరిస్థితులు నెలకొన్నా వాటన్నింటినీ అధిగమించి విజయ డైరీ ఈ రికార్డును నెలకొల్పడం గమనార్హం. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ సర్కార్ రాష్ట్రంలో సహకార రంగాన్ని ప్రోత్సహించాల్సింది పోయి అమూల్ వంటి ఇతర రాష్ట్ర సంస్థలను దిగుమతి చేసుకుని వాటిని ప్రోత్సహిస్తూ స్థానిక సహకార సంస్థలపై కత్తి కట్టింది. మరోవైపు దిగ్విజయంగా నడుస్తున్న సహకార యూనియన్లపై వైసీపీ నేతలు డేగల్లా తిరుగుతూ వాటిలో చొరబడి కొల్లగొట్టేందుకు చేయని ప్రయత్నం లేదు. వీటన్నింటినీ అధిగమిస్తూ విజయ డైరీని లాభాల బాటలో పయనింపజేయడంలో డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు కృషి ప్రత్యేకం. ఆయన చైర్మన్‌గా బాధ్యతలు తీసుకునే నాటికి యూనియన్ టర్నోవర్ రూ.712 కోట్లు. స్థూల లాభం రూ.84 కోట్లుగా ఉండేది. దాన్ని గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1196 కోట్లు, రూ.212 కోట్లుకు చేర్చారు. ఐదేళ్లలో స్థూల లాభాన్ని మూడు రెట్లుకు తీసుకెళ్లారు. మరోవైపు రైతులకు ఇచ్చే పాలసేకరణ ధరను సైతం రూ.100కు తీసుకెళ్లే దిశగా కృషి చేస్తున్నారు. ఆంజనేయులు చైర్మన్‌గా బాధ్యతలు తీసుకునే సమయానికి పాలసేకరణ ధర రూ.56గా ఉండేది. ప్రస్తుతం రూ.90 చెల్లిస్తున్నారు. ఏడాదిలో దీన్ని రూ.100కు చేరుస్తానని ఆంజనేయులు ప్రకటించారు.

- వైసీపీ నేత వల్లూరు ఈశ్వరప్రసాద్ అరెస్టు
- 2022లో ఘటన.. కన్ను కోల్పోయిన గాంధీ
- కేసులో ఏ5గా ఈశ్వరప్రసాద్
- తాజాగా ఐపీసీ 307 చేర్చి అరెస్టు
- దేవినేని అవినాష్‌కు ముఖ్య అనుచరుడు

చెన్నుపాటి గాంధీపై హత్యాయత్నం కేసు

రీ ఓపెన్..!

విజయవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 9వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీపై జరిగిన దాడి కేసును పోలీసులు బయటకు తీశారు. ఈ కేసులో ఆది నుంచి ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టు నుంచి తప్పించుకున్న వైసీపీ నేత వల్లూరు ఈశ్వరప్రసాద్‌ను పటమట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ప్రస్తుతం ఉన్న సెక్షన్లకు అదనంగా ఐపీసీ 307 సెక్షన్‌ను చేర్చారు.


ముందస్తు ప్రణాళికతో దాడి

2022, సెప్టెంబరు 4న పటమటలంకలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను చెన్నుపాటి గాంధీ పరిశీలించడానికి వెళ్లారు. ఈ డివిజన్‌కు గాంధీ కార్పొరేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య క్రాంతిశ్రీ కార్పొరేటర్‌గా ఉన్నారు. ఇదే డివిజన్‌కు వల్లూరు ఈశ్వరప్రసాద్, గద్దె కల్యాణ్ వైసీపీ నాయకులుగా ఉన్నారు. వారిలో కల్యాణ్ వైసీపీ 9వ డివిజన్ అధ్యక్షుడిగా ఉన్నాడు. ఈ ఇద్దరూ వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు ముఖ్య అనుచరులు. గాంధీ డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సమయంలో గద్దె కల్యాణ్, మరో ముగ్గురు యువకులతో అక్కడికి చేరుకున్నాడు. ఆయనతో ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగాడు. మాటమాటా పెరగడంతో కల్యాణ్‌తో పాటు మిగిలిన ముగ్గురు యువకులు గాంధీపై దాడి చేశారు. బలంగా కొట్టడంతో గాంధీ కుడికన్ను గుడ్డు పగిలి బయటకు వచ్చింది. ఆయన కన్ను కోల్పోయారు. ఇనుప చువ్వ వంటి ఆయుధంతో కంట్లో పొడిచారని ఆయన ఆరోపించారు. ఈ ఘటన సరిగ్గా వల్లూరు ఈశ్వరప్రసాద్ ఇంటికి కూతవేటు దూరంలో జరిగింది. దీనిపై పటమట పోలీసులు ఐపీసీ 326, 506, రెడ్‌విత్ 34 సెక్షన్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఏ1గా గద్దె కల్యాణ్, ఏ2గా లీలాకృష్ణ ప్రసాద్, ఏ3గా సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు, ఏ4గా శ్రీనివాస్‌ను చేర్చారు. ఈ ఘటనకు ఈశ్వరప్రసాద్ కారణమని, అతడు వెనుక ఉండి కథను నడిపించాడని, దాడి జరిగే సమయంలో అక్కడే ఉన్నాడని టీడీపీ నేతలు ఆరోపించారు. నాడు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఈశ్వరప్రసాద్ పేరు చేర్చలేదు. కేసులో హత్యాయత్నం సెక్షన్ చేర్చాలని డిమాండ్ చేశారు. పోలీసులు మాత్రం మూడు సెక్షన్ల కిందే కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా, రిమాండ్‌ను కోర్టు తిరస్కరించింది. గాంధీ గాయాలకు సంబంధించి వైద్యులు ఇచ్చే ఊండ్ సర్టిఫికెట్‌ను రిమాండ్ రిపోర్టుకు జత చేయకపోవడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆ నలుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈ విషయం అప్పట్లో తీవ్రమైన విమర్శలకు తావిచ్చింది. కొద్దిరోజుల క్రితం టీడీపీ నేతలు పోలీసు కమిషనర్‌ను కలిశారు. ఈ కేసును పునఃవిచారణ చేయించాలని కోరారు. విచారణను తిరిగి ప్రారంభించిన పోలీసులు తాజాగా ఈశ్వర ప్రసాద్‌ను అరెస్టు చేశారు. కేసులో ప్రస్తుతం ఉన్న సెక్షన్లతో పాటు 307 సెక్షన్‌ను అదనంగా చేర్చారు. వల్లూరు ఈశ్వరప్రసాద్‌ను పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి అతడి రిమాండ్‌ను తిరస్కరించారు. ఐపీసీ 307 సెక్షన్ చేర్చడాన్ని అంగీకరించలేదని తెలిసింది. దీంతో ఇతర నిందితులకు ఇచ్చినట్టుగా స్టేషన్ బెయిల్ ఇచ్చారు.



దాడిలో గాయపడిన గాంధీని పరామర్శిస్తున్న చంద్రబాబు (ఫైల్)

న్యాయ పోరాటం!



- అత్తింటి ముందు 4 రోజులుగా తిండీ, నిద్ర లేక గర్భిణి దీక్ష
- గేటుకు తాళం వేసిన వెళ్లిపోయిన అత్త, మామ
- సీపీకి ఫిర్యాదు చేసినా జరగని న్యాయం

6లో..



గుడివాడ మండలంలో జాతీయ రహదారి పనుల తీరిలా..

రహదారి పనుల్లో నాణ్యతా లోపం!

» నాసిరకం పైపులతో రైతులకు ఇక్కట్లు

6లో..

దిగువ ప్రాంతాల్లో నీటి కష్టాలు తీవ్రం

» మరమ్మతులకు నోచని కాల్వలు
» దట్టంగా తూడు, గుర్రపు డెక్క. తీరుమారని అధికారులు

6లో..



పుల్లేరులో బల్లపరుపులా ఏర్పడిన గుర్రపుడెక్క



రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నెట్టెం, తాతయ్య

కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి

▸ రంగా జయంతిలో నెట్టెం, తాతయ్య హామీ

జగ్గయ్యపేట, జూలై 4 : జగ్గయ్యపేటలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తామని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలో కాపు వారధి టీం, అఖిల భారత కాపు సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన వంగవీటి మోహన రంగా జయంతిలో వారు పాల్గొన్నారు. రంగా అన్ని వర్గాలకు తన విధానాలతో దగ్గరైన నేతగా కొనియాడరు. కాపుల కోసం పట్టణంలో కమ్యూనిటి హాలు నిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. మాజీ మునిసిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, శ్రీరాం చిన బాబు, యలమంచిలి రాఘవ, వేదులాపురి సైదా, కన్నెబోయిన రామలక్ష్మీ, డి.లక్ష్మణ రావు, మీసాల చిట్టిబాబు, బాబ్జీనాయుడు, జనసేన నేత ఈమని కిశోర్, పలువురు టీడీపీ కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ, కాపు నేతలు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగం, ధైర్యం అందరికీ ఆదర్శం

▸ కృష్ణాజిల్లా కలెక్టర్, ఎస్పీ



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , జూలై 4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు, త్యాగం అందరికీ ఆదర్శమని కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మన్యం వీరుడు అల్లూరి జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కలెక్టర్ బాలాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి పద్మ, జడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షాహిద్ బాబు, సివిల్ సప్లయిస్ జనరల్ మేనేజరు తోట సతీష్, దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి గురువారం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్పీ ఇనస్పెక్టర్ రంగనాథ్, ఆర్ఐలు కృష్ణంరాజు, సతీష్, ఏవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి



▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

వన్‌టౌన్, జూలై 4 : జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు జరగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారుల నివేదికలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పూర్వ, ప్రాథమిక విద్య సరైన విధానంలో కొనసాగాలని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య విద్యార్థి భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్వవిద్య అందించాలన్నారు. మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందజేయాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇందుకోసం ఇంటర్నల్ కంప్లెయింట్ కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్, పిల్లల హోమ్‌లు తదితరాలపై ఆమె సమీక్షించి తగు సూచనలు చేశారు. ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీసీపీవో రాజేశ్వరరావు తదితరులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

పాడిరైతు కుటుంబాల సంతోషమే లక్ష్యం

▸ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని



చలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూలై 4 : రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా లక్షలాది పాడిరైతు కుటుంబాల సంతోషమే లక్ష్యం, ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(విజయ) ఫ్యాక్టరీలో గురువారం చలసాని జన్మదినోత్సవ సందర్భంగా పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. యూనియన్‌లో సభ్యులైన పాడిరైతులకు సేవలందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. లక్ష్యసాధనలో సహకరించిన ప్రతి పాడిరైతుకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ ఆంజనేయులును సిబ్బంది గజమాలతో సత్కరించారు.

బెదిరించి నా తల్లిని చంపేశారు

▸ బేవరేజెస్ గోడౌన్ కాంట్రాక్టులో అవినీతి బాగోతం
▸ నిబంధనలు తుంగలో తొక్కి గోడౌన్ కాంట్రాక్ట్ కట్టబెట్టారు
▸ ఎండీ వాసుదేవరెడ్డి, కొడాలి, అప్పటి జేసీ మాధవీలత రెడ్డి బాధ్యులు
▸ పూర్తి ఆధారాలతో సిట్‌కు అందజేశా
▸ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ కాంట్రాక్టర్ దుగ్గిరాల ప్రభాకర్ వెల్లడి



గుడివాడ : బేవరేజెస్ గోడౌన్ కాంట్రాక్టు విషయంలో తన తల్లి సీతామహాలక్ష్మిని వైసీపీ ప్రభుత్వంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, అతని అనుచరులు బెదిరించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీంతో ఆమె మనస్తాపంతో మృతి చెందారని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ కాంట్రాక్టర్ దుగ్గిరాల ప్రభాకర్ ఆరోపించారు. గుడివాడ ఆటోనగర్‌లో గురువారం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. బేవరేజెస్ గోడౌన్ విషయంలో అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, నాటి జేసీ మాధవిలతారెడ్డి చేసిన అవినీతిపై సిట్‌కు ఫిర్యాదు చేశానన్నారు. బహిరంగ టెండర్ ద్వారా చదరపు అడుగు కేవలం రూ.4లకు బేవరేజెస్ గోడౌన్ కాంట్రాక్టును తన తల్లి దక్కించుకున్నారన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టు కాలపరిమితి కాకుండానే గోడౌన్‌ను అక్రమంగా తరలించారన్నారు. పద్మారెడ్డి అనే వ్యక్తికి లబ్ధి చేకూర్చేందుకు వాసుదేవరెడ్డి ప్రయత్నించారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే వాసుదేవరెడ్డి తన తల్లిని, తనను తీవ్రంగా దుర్భ లాషలాడారన్నారు. అప్పట్లో ఎమ్మెల్యే కొడాలి నాని, అతని అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ తనను ఫోన్‌లో బెదిరించారన్నారు. తనను, తన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఎమ్మెల్యే నాని గడ్డం గ్యాంగ్‌తో గోడౌన్‌లోని లిక్కర్ కేసులను పగులకొట్టి తగులబెట్టారని ఆరోపించారు. నందిపాటి పద్మారెడ్డికి చెందిన నందివాడ మండలం జొన్నపాడులోని శ్రీవంశీరామ్ ఎంటర్‌ప్రైజెస్‌కు గోడౌన్ కాంట్రాక్టును దక్కేలా చేశారన్నారు. పద్మారెడ్డికి బేవరేజెస్ కార్పొరేషన్ ప్రతినెలా రూ.1.20 లక్షలు అదనంగా చెల్లించిందన్నారు. మొత్తం వ్యవహారంలో పద్మారెడ్డితో పాటు అతని అల్లుడు ఐఆర్ఎస్ కర్రి రామ్‌గోపాల్‌రెడ్డి కూడా భాగస్వామ్యుడని, కార్పొరేషన్ సొమ్మును ఇష్టానుసారంగా దోచేశారన్నారు. లక్షలాది రూపాయల కుంభకోణాన్ని పూర్తి ఆధారాలతో సిట్‌కు అందజేశానని దుగ్గిరాల ప్రభాకర్ వివరించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం



విస్సన్నపేట, జూలై 4 : పట్టణానికి చెందిన యువకుడు కొమ్మూరి షణ్ముక శ్రీసాయి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2024లో స్థానం సంపాదించినట్టు అతడి తండ్రి త్రినాథ్ తెలిపారు. సైబర్‌సెక్యూరిటీ, పెన్ టెస్టింగ్ పరిశోధన, భద్రతా లోపాలను గుర్తించే విషయంలో వెబ్‌సైట్స్ మొబైల్ అప్లికేషన్స్ (ఏపీఐ), వైర్‌లెస్ నెట్ వర్కింగ్ సైబర్ దాడులు జరగకుండా ముందుగా గుర్తించి వాటి పరిష్కారాలను తెలియజేసినందుకుగాను ఈ అవార్డు లభించినట్టు ఆయన తెలిపారు. నాసా, కొలంబియా ప్రెసిడెంట్ ఏజెన్సీ, నేషనల్ పార్క్ ఏజెన్సీ తదితర అంతర్జాతీయ సంస్థలను సైబర్ దాడుల నుంచి, హ్యాకర్ల నుంచి రక్షించినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సైబర్ రీ సెర్చింగ్ సమ్మిట్‌కు షణ్ముక సాయికి ఆహ్వానం అందిందన్నారు.

పటిష్టంగా ఉచిత ఇసుక



▸ ఎనిమిది స్టాక్ పాయింట్లలో 3,69,588 క్యూబిక్ మీటర్ల నిల్వలు
▸ తవ్వకం, రవాణా, లోడింగ్, సీనరేజ్ ఫీజు నామమాత్రపు వసూలు
▸ రీచ్ ప్రాంత రహదారులు, ర్యాంపుల అభివృద్ధికి వినియోగం
▸ డీఎల్ఎస్‌సీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 4 : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం జరిగింది. జిల్లాలోని వివిధ ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వలు, ఉచిత విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రాష్ట్రప్రభుత్వం ఈనెల 8వ తేదీ సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినందున, ఈ మేరకు జిల్లాస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించి, ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 12 ఇసుక నిల్వ కేంద్రాలకు సంబంధించి ఎనిమిది కేంద్రాల్లో 3,69,588 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో వుందని తెలిపారు. ఇసుక తవ్వకం, లోడింగ్, రవాణా ఖర్చు, సీనరేజ్ ఫీజు మాత్రమే నామమాత్రంగా వినియోగదారుల నుంచి వసూలు చేయడం జరుగుతుందని, ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని, నేరుగా జిల్లా, మండల పరిషత్‌లు, పంచాయతీలకు వెళుతుందన్నారు. ఈ మొత్తాన్ని రీచ్ ప్రాంత రహదారులు, ర్యాంపులు తదితరాల అభివృద్ధికి వినియోగించడం జరుగుతుందన్నారు. ఇసుక నిల్వ కేంద్రాల వద్ద నామమాత్రపు రుసుం వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని మైన్ అండ్ జియాలజీ, రెవెన్యూ, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులు పటిష్ట అమలుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఇసుక కొరతలేకుండా చూసేందుకు పూడిక రూపంలో వున్న ఇసుక పాయింట్లను కూడా గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డీవీ రమణ, డీపీవో ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్, గ్రౌండ్ వాటర్ డీడీ బి.నాగరాజు, డీటీసీ ఎం.పురేంద్ర, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

వివిధ స్టాక్ పాయింట్లలో అందుబాటులో వున్న ఇసుక (క్యూబిక్ మీటర్లు)

పెండ్యాల (కంచికచర్ల మండలం)	19,781
మాగల్లు (నందిగామ మండలం)	36,366
కొడవటికల్లు (చందర్లపాడు మండలం)	9,713
అల్లూరుపాడు (వత్సవాయి మండలం)	3,040
అనుమంచిపల్లి (జగ్గయ్యపేట మండలం)	56,820
పోలంపల్లి (వత్సవాయి మండలం)	922
కీసర (కంచికచర్ల మండలం)	1,49,703
మొగులూరు (కంచికచర్ల మండలం)	93,243

ప్రజల కోసం జరిగిన ఎన్నికలు

▸ వంగవీటి రాధా

గవర్నర్‌పేట : రాష్ట్రంలో గత సార్వత్రిక ఎన్నికలు ప్రజల కోసం జరిగాయని, అందుకే ప్రజలే గెలిచారని మాజీ ఎమ్మెల్యే రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. వంగవీటి మోహన రంగా 77వ జయంతిని పురస్కరించుకుని ఎంజీ రోడ్డులోని రంగా విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. రంగా కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం రాధా మాట్లాడుతూ, సామాన్యుడికి న్యాయం జరగాలన్నదే తన తండ్రి ఆశయమని అన్నారు. రంగా ఆశయ సాధన కోసం అందరూ కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రజల్ని ప్రభుత్వాలు, పాలకులు విస్మరిస్తే ఏమి జరుగుతుందో గత ఎన్నికల ఫలితాలు నిరూపించాయన్నారు.

దుర్గగుడిలో రికార్డుల పరిశీలన

▸ ఆలయంలో బంగారు, వెండి ఆభరణాల వివరాలపై జేఈవో ఆరా

వన్‌టౌన్, జూలై 4 : రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు దేవదాయశాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్(జేఈవో) దుర్గాభవాని గురువారం సాయంత్రం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని బంగారు, వెండి ఆభరణాల రికార్డులను పరిశీలించారు. ఇటీవల సంబంధిత విభాగం అధికారిణి దేవస్థానంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచిన బంగారు ఆభరణాల వివరాలు నమోదు చేసిన రికార్డు ప్రకారం కొంతమేరకు తగ్గిందని దేవస్థాన ఈవో కేఎస్ రామారావుకు లిఖితపూర్వకంగా లేఖ అందజేశారు. అయితే ఆ రోజు హుండీలలోని కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఈవో ఉండటం ద్వారా ఆ అధికారిణికి, ఈవోకు మధ్య కొద్దిపాటి వాగ్వివాదం జరిగింది. దీంతో ఆ అధికారిణి నేరుగా దేవదాయశాఖ కమిషనర్‌తో పాటు సంబంధిత ముఖ్య అధికారులకు మెయిల్ ద్వారా బంగారు ఆభరణాలు తగ్గిన అంశాన్ని తెలియజేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన కమిషనర్ దుర్గగుడిలో బంగారు, వెండి ఆభరణాల రికార్డులను పరిశీలించాలని జేఈవోను ఆదేశించారు. దీంతో జేఈవో దుర్గాభవాని ఆలయానికి విచ్చేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. శుక్రవారం కూడా రికార్డులను పరిశీలించనున్నట్టు ఈవో తెలిపారు.

న్యాయ పోరాటం!

▸ అత్తింటి ముందు నాలుగు రోజులుగా తిండీ, నిద్ర లేక గర్భిణి దీక్ష
▸ గేటుకు తాళం వేసిన వెళ్లిపోయిన అత్త, మామ
▸ సీపీకి ఫిర్యాదు చేసినా జరగని న్యాయం



భర్త

అత్తింటి ముందు కొడుకుతో ఉమ దీక్ష

విజయవాడ రూరల్, జూలై 4 : జీవితాంతం తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త పెళ్లయిన ఐదేళ్లకే వదిలించుకుని ఎటో వెళ్లిపోయాడు. పుట్టింటికి వెళదామంటే అక్కడ ఒంటరిగా ఉంటూ ఇళ్లల్లో పాచిపని చేసుకునే తల్లి. నాలుగేళ్ల కొడుకు, మరో పక్క నాలుగు నెలల గర్భిణి.. అత్తింటి వారు ఆదుకుంటారనుకుంటే ఇంట్లోకి రానివ్వడం లేదు. పైగా ఇంటి గేటుకు తాళం వేసి మరీ వెళ్లిపోయారు. అయినవారు లేక అత్తింటి వారు రానివ్వక నున్న గ్రామం కుమ్మరి బజార్‌లో గర్భిణి పడుతున్న అవస్థలు చుట్టుపక్కలవారిని కంటతడి పెట్టిస్తున్నాయి.

పెనుగంచిప్రోలుకు చెందిన యనగంటి ఉమకు విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన భార్గవ్‌తో 2019లో వివాహమైంది. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. నాలుగేళ్ల క్రితం ఉమ ఓ బాబుకు జన్మనిచ్చింది. భర్త పనీపాట లేకుండా తిరుగుతూ అప్పులు చేస్తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. కుటుంబ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు పెట్టినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఆరు నెలల క్రితం ఉమ పుట్టింటికి వెళ్లిపోయింది. మళ్లీ పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి ఉమను భర్త నర్సారావుపేటకు కాపురానికి తీసుకెళ్లాడు. అయినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా ఏకంగా నాలుగు నెలల గర్భవతైన ఉమను, కొడుకును జూన్ 18న వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. అద్దె కూడా చెల్లించలేని పరిస్థితిలో జూన్ 20న ఇంటి యజమాని చార్జీలకు డబ్బులివ్వగా.. ఆమె నున్న గ్రామంలోని అత్తింటికి వచ్చింది. అక్కడ పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టారు. వాళ్లు మాట్లాడతామన్నారు. ఇంతలో జూన్ 29న అత్తమామలు తమ కుమారుడిని కోడలు ఏదో చేసిందని నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉమ స్టేషన్‌కు వెళ్లి తన గోడును వెళ్లబోసుకుంది. పోలీసులు అత్తమామలను పిలిపించి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసుల ఎదుట తలాడించిన అత్తమామలు కోడల్ని స్టేషన్ బయటే వదిలేసి వెళ్లిపోయారు. కొడుకు చేసిన పనికి కోడల్ని ఆదరించాల్సింది పోయి అత్తమామలు ఇంటి గేటుకు కూడా తాళం వేసి వెళ్లిపోయారు.

ఈనెల 1న పోలీసు కమిషనర్ కార్యాలయంలో భర్త అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. నాలుగు రోజులుగా ఆమె అత్తింటి ఎదుట దీక్షకు పూనుకుంది. తిండీ నిద్ర లేకుండా కొడుకుతో రోడ్డుపైనే ఉంటోంది. అయినా భర్త కుటుంబసభ్యులు కనికరం చూపడం లేదు. గర్భవతైన వివాహిత ఏమైపోతుందో అన్న జాలితో స్థానికులు భోజనం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నా అలానే దీక్షను కొనసాగిస్తోంది. ఎండా, వానకు చలించకుండా వివాహిత చేస్తున్న పోరాటం అక్కడి వారిని కలచివేస్తోంది. తనకు తిండి పెట్టాల్సిన అవసరం లేదని ఇంట్లో కాస్త ఆశ్రయం కల్పిస్తే కూలి పనులు చేసుకుని తన కొడుకుతో తలదాచుకుంటానని అంటోంది.

లంక భూముల్లో అనధికార బట్టీలు!

▸ అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ
▸ నిర్వాహకుల్లో వైసీపీ ప్రజాప్రతినిధుల భర్తలు
▸ బట్టీల వద్ద రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు
▸ వెలుగులోకి వస్తున్న అనధికార బాగోతం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

అధికారం, అండదండలు ఉండటంతో వైసీపీ నేతలు కనిపించిన ఏ వనరుని వదల్లేదు. కొండలను కొల్లగొట్టారు. మట్టిని మోసేశారు. ఇసుకను ఇష్టానుసారం తవ్వేశారు. ఐదేళ్లలో చేసిన అకృత్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మూలపాడులో వైసీపీ నేతల అనధికార ఇటుక బట్టీల బాగోతం రెవెన్యూ, భూగర్భ గనులశాఖలోని విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనధికార ఇటుక బట్టీల నిర్వాహణ వెనుక వైసీపీ నేతల పాత్ర ఉన్నట్టు స్పష్టంగా తేలింది.

లెక్కలేనితనం..

మూలపాడు గ్రామంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాన్ని ఆనుకుని లంక భూములు ఉన్నాయి. సాధారణంగా ఇటుక బట్టీలకు రెవెన్యూ, జలవనరుల, భూగర్భ గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి. వైసీపీ అధికారంలో గ్రామానికి చెందిన నేతలు ఈ భూముల్లో రాత్రికి రాత్రి ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా లక్షలాది రూపాయలు వెనుకేసుకున్నారు. విషయం తెలిసినా అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడలేదు. వాస్తవానికి ఇబ్రహీంపట్నం ఇప్పటికే కాలుష్య కోరల్లో కూరుకుపోయింది. వీటీపీఎస్ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నాన్ని కాలుష్యం చుట్టేస్తుండగా వైసీపీ నేతలు దానికి ఆజ్యం పోశారు. జిల్లాపరిషత్ వైస్‌చైర్మన్ భర్త గరికపాటి రాంబాబు, మూలపాడు ఎంపీటీసీ భర్త గొట్టిముక్కల పోతురాజు ఇక్కడ ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బట్టీల డొంక కదిలింది. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. భూగర్భ గనుల శాఖలోని విజిలెన్స్ రెవెన్యూ, పోలీసు అధికారులతో విచారణ చేయించారు. గరికపాటి రాంబాబుకు గడచిన నెల 29వ తేదీన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ నోటీసు జారీచేశారు. ఆయన ఈనెల ఒకటో తేదీన నోటీసు తీసుకున్నారు. రెండు రోజుల్లో బట్టీలను ఖాళీచేయాలని నోటీసుల్లో ఆదేశించారు. అయినా లెక్కచేయకుండా యథావిధిగా బట్టీలను నిర్వహిస్తున్నాడు. మొత్తం పది అనధికార బట్టీలు ఉన్నట్టు గుర్తించారు. వాటిపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

3 లక్షల ఇటుకలు సీజ్

ఇబ్రహీంపట్నం : లంక భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. జెట్టి శ్రీను అనే లంక భూముల సభ్యుడి ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగి చర్యలకు పూనుకున్నారు. తమ భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తూ ఖాళీ చేయకుండా ఐదేళ్లుగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మైనింగ్, పొల్యూషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. మూలపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత జడ్పీ వైస్ చైర్ పర్సన్ గరికపాటి శ్రీదేవి భర్త గరికపాటి రాంబాబుకు చెందిన సుమారు 3 లక్షల ఇటుకలను సీజ్ చేసినట్టు ఆర్ఐ విగోపి తెలిపారు.

7న గుడివాడలో కృష్ణా జిల్లా అండర్-19 చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 4 : గుడివాడలోని త్రివేణ స్కూల్లో ఈనెల 7న కృష్ణా జిల్లా అండర్-19 చెస్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎన్ఎం.ఫణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన బాలబాలికలను నంద్యాలలో ఈ నెల 18, 19వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల్లోగా ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9700775220, 9247153387 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మైనింగ్ శాఖ ఫైల్స్ దహనం కేసులో..

దోషులను విడిచిపెట్టేది లేదు

▸ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 4 : మైనింగ్ శాఖ ఫైల్స్ దహనం కేసులో ఎవరినీ వదిలిపెట్టేది లేదని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం ఉదయం చిలకలపూడిలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థలకు చెందిన బస్తాల కొద్దీ దస్త్రాలను అవనిగడ్డ కరకట్టపై తగులబెట్టిన కేసులో ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు. ఏపీ ఎండీసీకి చెందిన దస్త్రాలు కూడా ఉన్నట్టు తెలుస్తోందన్నారు. హార్డ్‌డిస్కులను సైతం తగులబెట్టారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామన్నారు. కరకట్టపై తగులబెట్టిన సమయంలో వచ్చిన కారుకు ప్రభుత్వ వాహనం స్టిక్కర్ ఉందన్నారు. కారుపై మాజీ మంత్రుల చిత్రాలు కూడా కనబడుతున్నాయన్నారు. ఈ ఘటనలో కొంత మంది అధికారుల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తోందని, వారినీ వదిలేది లేదన్నారు.

జగన్‌వి దిగజారుడు వ్యాఖ్యలు

▸ మాజీమంత్రి దేవినేని ఉమా

గొల్లపూడి, జూలై 4 : ఈవీఎంల ధ్వంసం కేసులో అరెస్టు అయిన పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ములాకత్ సమయం లేకుండా నెల్లూరు జైలు ప్రాంగణంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి దుర్మార్గాలు, అరాచకాలు, దోపిడీ పాలనకు ప్రజలు 151 సీట్లకు వాత పెట్టి 11 సీట్లు ఇస్తే ప్రజల తీర్పును గౌరవించకుండా సీఎం చంద్రబాబుపైనా, కూటమి ప్రభుత్వంపైనా శాపనార్థాలు పెడుతున్నారన్నారు. పల్నాడులో తోట చంద్రయ్య పీక కోసి చంపారని, కంచర్ల జమలయ్య ఇంటిపై దాడి చేసి చంపారని, బుద్దా వెంకన్న, బోండా ఉమాపై దాడి చేశారన్నారు. పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసి, అరాచకాలు సృష్టించి పోలీసులపై దాడి చేసిన పిన్నెల్లి నీ స్నేహితుడా.. మంచివాడా.. సౌమ్యుడా జగన్ రెడ్డి! అని ఉమా ప్రశ్నించారు.



పెదపట్నంలో రేషన్ షాపు సీజ్ చేస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

పెదపట్నం రేషన్ షాపు సీజ్

మచిలీపట్నం టౌన్, జూలై 4 : గ్రామస్థుల ఫిర్యాదు మేరకు బందరు మండలం పెదపట్నం వైసీపీ గ్రామ సర్పంచ్ భర్త నిర్వహిస్తున్న రేషన్ డిపోపై గురువారం సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ సుభాన్‌బి, ఆర్ఐ యాకుబ్, వీఆర్వో గణేష్‌లు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రేషన్ బియ్యం, పంచదార, బెల్లం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో రేషన్ షాపుపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. వినియోగదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు కానూరు గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలర్‌కు బాధ్యతలు అప్పగించారు.

రహదారి పనుల్లో నాణ్యతా లోపం!



చౌటపల్లి నూతన బైపాస్ రోడ్డుపై ధర్నా చేస్తున్న ఐదు గ్రామాల రైతులు



మందం తక్కువగా ఉన్న పైపులు



నాణ్యత లేని గ్రావెల్

▸ నిబంధనల ఉల్లంఘనపై రైతుల ఆందోళన

గుడివాడ రూరల్, జూలై 4 : గుడివాడ మండలం నుంచి వెళ్లే నూతన జాతీయ రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని 165వ జాతీయ రహదారిపై గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. టీడీపీ నాయకులు అట్లూరి రమణ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళి తదితరులు మాట్లాడుతూ.. చౌటపల్లి, సిద్ధాంతం అడ్డరోడ్డు వద్ద నూతనంగా నిర్మించనున్న జాతీయ రహదారి వెంట పొలాల మీదుగా తూములు వేసేటపుడు కనీస నిబంధనలు పాటించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతలేని తూములు పెట్టడం వల్ల అవి త్వరలోనే పాడైపోతాయని తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రామును సంప్రదించి సంబంధిత అధికారులకు ఫోన్లు చేయించామని, స్పందన లేదని తెలిపారు. తూములు వేసినా నాణ్యత అంతంతమాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పంట పొలాలు నీరు అందక బీడుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రావెల్ నాసిరకంగా వేయటంతో పొలాలు, పంట బోదెలు పాడైపోయే అవకాశం ఉందన్నారు. సంబంధిత ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు స్పందించకపోవటంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, డ్రెయినేజీ, జాతీయ రహదారుల అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

దిగువ ప్రాంతాలకు నీటి కష్టాలు!

▸ మరమ్మతులకు నోచని కాల్వలు
▸ దట్టంగా తూడు, గుర్రపు డెక్క. తీరుమారని అధికారులు



పుల్లేరులో బల్లపరుపులా ఏర్పడిన గుర్రపుడెక్క

గుడ్లవల్లేరు, జూలై 4 : అదను దాటేవరకూ ఇరిగేషన్ శాఖలో పనులు నిర్వహించని తీరు దశాబ్దాలుగా మారడంలేదు. కాల్వల మరమ్మతులు, గుర్రపుడెక్క తొలగింపు పనులు వేసవిలో మొదలుపెట్టారు. వర్షాలు మొదలై, కాల్వలు వచ్చే సమయంలో టెండర్లు పిలవడం మమ అనిపించడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా తీరు మార్చుకుని ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని గుర్తెరగాల్సిన అవసరం ఉంది. పుల్లేరు నుంచి గుడ్లవల్లేరులో క్యాంబెల్, పోలరాజు, బంటుమిల్లి కెనాళ్ల ద్వారా దిగువకు తాగు, సాగునీరు చేరాల్సి ఉంది. అయితే పుల్లేరులో గుడ్లవల్లేరు రైల్వే బ్రిడ్జి నుంచి ఎగువకు దాదాపు మామిడి కోళ్ల వరకూ మూడు కిలోమీటర్ల మేర గుర్రపు డెక్క దట్టంగా పెరిగింది. ఏప్రిల్‌లో తాగు నీరు విడుదల సమయంలో రైల్వే బ్రిడ్జి వద్ద కొంత డెక్కను తీసి గట్టున వేశారు. నీరు కిందికి దిగిన తర్వాత డెక్కను మందు పిచికారీ చేస్తే ఎండలకు మాడిపోయి ఉండేది. కానీ ఆపని చేయలేదు. రోజురోజుకు గుర్రపుడెక్క పెరిగిపోయింది. మున్ముందు ప్రకాశం బ్యారేజి నుంచి నీరు విడుదల చేస్తే మరికొంత కొట్టుకురావడంతో నీటి ప్రవాహం మందకొడిగా సాగే ప్రమాదం ఉంది. దిగువ ప్రాంతాల్లో తాగు, సాగునీటి కోసం ప్రజలు, రైతులు ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. మూడు కాల్వల కింద గుడివాడ, కైకలూరు, పెడన నియోజకవర్గాల పరిధిలో వందల గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు పైగా సాగునీరు ఇక్కడి నుండే వెళ్లాల్సిన అవసరం ఉంది. ఎన్నికల వల్ల టెండర్లు ఆలస్యం అయిందనే సాకును అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా టెండర్లు పిలిచి తూడు తొలగింపు పనులు చేపట్టి సాగు, తాగు నీరు సక్రమంగా దిగువ ప్రాంతాలకు చేరేలా చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

మహనీయుడు పింగళి వెంకయ్య

గుణదల, జూలై 4: దేశ అభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసిన మహనీయుడు పింగళి వెంకయ్య అని ఎంపీడీవో ఎం.ఎం.ఆనందకుమారి అన్నారు. చల్లపల్లి బంగ్లా వద్దగల విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి అధికారులు, సిబ్బందితో కలిసి ఆనందకుమారి నివాళులర్పించారు. పింగళి వెంకయ్య, అల్లూరి సీతారామ రాజు వంటి మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండీవో కార్యాలయ పరిపాలన అధికారి ఎన్.శివరామకృష్ణ, బి.ఎల్.వి. శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రామవరప్పాడులో వీఎం రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు



ఉయ్యూరు బస్టాండ్ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైవీబీ



కోడూరుపాడులో నివాళులర్పిస్తున్న కొండపల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి శివన్నారాయణ

పేదల పెన్నిధి వీఎం రంగా

ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి ● నివాళులర్పించిన ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, అభిమానులు

గుణదల, జూలై 4: పేదల పెన్నిధి వంగవీటి మోహనరంగా అని, ఆయన పేదల పక్షాన నిరంతర పోరాటాలు చేశారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రంగా జయంతి సందర్భంగా రామవరప్పాడులో వీఎం రంగా కాంస్య విగ్రహానికి గురువారం యార్లగడ్డ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో అభిమానులు ఉన్న నాయకుడు వీఎం రంగా అని కొనియాడారు. టీడీపీ రామవరప్పాడు గ్రామ అధ్యక్షుడు నబిగాని కొండయ్య, పార్టీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, సీనియర్ నాయకుడు కొల్లా ఆనంద్, అద్దేపల్లి సాంబశివనాగరాజు(సాంబు) పాల్గొన్నారు.

ఉయ్యూరులో వంగవీటి శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో..

ఉయ్యూరు: బడుగు, బలహీన వర్గాల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న నాయకుడు వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రంగా జయంతిని పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ వంగవీటి శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో ఉయ్యూరు ప్రధానసెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోడె ప్రసాద్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. రంగా చిత్రపటానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో రంగా విగ్రహానికి నివాళులర్పించి, అన్నసమారాధన ప్రారంభించారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్ర రావు, ఖద్దూస్, రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాస రావు, రత్నం బుజ్జి, జనసేన నాయకుడు ముప్పారాజా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాటూరు సెంటర్‌లో ఇందిరాసి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ తదితరులు రంగా చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాను, రాహుల్, సుబ్బారావు, సాంబయ్య, కార్తీక్, రవి పాల్గొన్నారు.

కోడూరుపాడులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కోడూరుపాడు కూడలిలో రంగా విగ్రహానికి కొండపల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి శివన్నారాయణ, అంబటి రాజా నివాళులర్పించారు. నూకల గోవిందయ్య, చందు చిరంజీవి, గరికపాటి నాగబాబు, పుల్లయ్య సలాది నరసయ్య, శంకర్, సతీష్ పాల్గొన్నారు.



కంకిపాడులో రంగా విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, పక్కన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రజల గుండెల్లో రంగాకు సుస్థిర స్థానం

కంకిపాడు: ప్రజల గుండెల్లో వంగవీటి మోహన రంగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, 1988లో రంగా మరణించినా నేటికీ ప్రజలు ఆయనను స్మరించుకోవడమే అందుకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీఎం రంగా విగ్రహాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. కంకిపాడు బైపాస్‌పై రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా గ్రామస్థులు కోరుతున్నారని, వారి కోరిక నేటికి నెరవేరిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పార్టీలకతీతంగా పెద్ద సంఖ్యలో రంగా అభిమానులు పాల్గొన్నారు.

యనమలకుదురు, పోరంకి, కానూరులో..

పెనమలూరు: వీఎం రంగా జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. యనమలకుదురు, పోరంకి, కానూరు గ్రామాల్లోని రంగా విగ్రహాలకు అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోరంకి ప్రధాన కూడలి వద్ద రంగా విగ్రహానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాస్, తాతపూడి గణేష్, వంగూరు మురళి, వంగూరు లీల, వంగూరు మురళి, వీర్ల సాయి, యేనుగ శ్రీనివాస్, మల్లిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



గన్నవరంలో బచ్చుల అర్జునుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నిబద్ధత గల నాయకుడు బచ్చుల అర్జునుడు

గన్నవరం, జూలై 4: నిజాయితీ, నిబద్ధత గల నేత మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో అర్జునుడు 65వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ అభ్యున్నతి కోసం అర్జునుడు ఎనలేని సేవలందించారని ప్రశంసించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్సీగా, టీడీపీ జాతీయ క్రమ శిక్షణ సంఘం చైర్మన్‌గా, గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారని తెలిపారు. బోడపాటి రవి, మోదుగుమూడి సత్యనారాయణ, మేడేపల్లి రమ, పరుచూరి నరేష్, నాగయ్య, వెంకటేశ్వర రావు, నాగప్రసాద్, సుధాకర్ దేవినేని సులోచన, కాట్రగడ్డ అరుణ, బడుగు ఝాన్సీ పాల్గొన్నారు.

ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు
వేగవంతం చేయండి

● సచివాలయ సిబ్బందికి తాడిగడప కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం

పెనమలూరు, జూలై 4: తాడిగడప మునిసిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న రూ.18కోట్ల ఆస్తి పన్నులు, రూ.6 కోట్ల నీటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని మునిసిపాలిటీ పరిధిలోని అన్ని సచివాలయాల సిబ్బందిని మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం కానూరు-2 సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఇంటిపన్నుల కోసం అవసరమైతే ఇళ్ల కొలతలు మళ్లీ తీసుకుని, పన్నుల ప్రక్రియను సరిచేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు, వడ్లమూడి శుభశేఖర్ పాల్గొన్నారు.

వేలేరు ఊరచెరువు ఒడ్డున
చనిపోయిన చేపలు

● దుర్గంధం భరించలేకపోతున్నామంటున్న గ్రామస్థులు
● అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం



చెరువు ఒడ్డున చనిపోయిన చేపలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 4: వేలేరు గ్రామం మధ్యలో ఉన్న ఊర చెరువులో చేపలు బుధవారం నుంచి చనిపోయి ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయని దీంతో దుర్గంధం వెదజల్లుతోందని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊరచెరువు గట్టు పైనే ప్రజలందరూ వినియోగించే వాటర్ ప్లాంటు ఉందని కలుషిత నీటి వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, నెలక్రితం ఇదే చెరువులో చేపలు సాగుచేస్తున్న గుత్తేదారు మాంసం వ్యర్థాలను చేపలమేతగా వినియోగిస్తుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై కేసు పెట్టినా అధికారుల్లో చలనం లేదని, జిల్లా పంచాయతీ అధికారులు చెరువును తనిఖీ చేశారని ఇంతవరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు కార్తీక్, వీర్ల బ్రహ్మం తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కానుమోలు ఆయుర్వేద ఆస్పత్రిలో
అందుబాటులో పంచకర్మ చికిత్సలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 4: ఆయుర్వేద చికిత్సా విధానంలో పంచకర్మ చికిత్స ముఖ్యమైనదని, దీంతో దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలుగుతుందని డాక్టర్ వాహిని తెలిపారు. కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో గురువారం నుంచి పంచకర్మ చికిత్సలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని ఆమె పేర్కొన్నారు. వ్యక్తి మానసిక, శారీరక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వ్యాధి తీవ్రత మేరకు 7రోజులు పంచకర్మ చికిత్స చేస్తామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాహిని సూచించారు.

రైతుబజారు ఏర్పాటు చేయాలని వినతి

పెనమలూరు, జూలై 4: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న ఇరిగేషన్ స్థలంలో రైతుబజారు ఏర్పాటు చేయించాలని సీపీఎం నాయకులు సంతకాలు సేకరించి ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు గురువారం అందజేశారు. గతంలో ఇంజనీరింగ్ కళాశాల లోపల రైతుబజారు నిర్వహించేవారని, గత పాలకులు కూరగాయలు అమ్ముకునే వాళ్లని ఫుట్‌పాత్‌పైకి ఈడ్చేశారని, దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇరిగేషన్ స్థలంలో రైతుబజారు ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాల వారికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఆగస్టు నెలాఖరుకల్లా రైతుబజారు ఏర్పాటుకు కృషి చేస్తానని సీపీఎం నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నారి వెంకట్రావు, వై.సరళ, పుసులూరి పాతాళలక్ష్మి, అశోక్‌కుమార్, పద్మావతి, వెంకటరెడ్డి ఉన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా

ఉంగుటూరు, జూలై 4: టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని, ఆదుకుంటానని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. నందమూరు గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు అనగాని సురేష్ తండ్రి అనగాని సాంబశివరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం దశదిన కర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేశారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీకి చెందిన పేద కుటుంబాలకు ఏ ఆపదొచ్చినా, వారికి తోడుగా నిలిచి, చేయూతనందించాలని పార్టీశ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

అయ్యప్ప ఆలయానికి రూ.45వేలు విరాళం

ఉయ్యూరు, జూలై 4: అయ్యప్పస్వామి ఆలయానికి బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత, సామాజికవేత్త బొమ్మారెడ్డి వెంకటరెడ్డి రూ.45వేల విరాళాన్ని గురువారం అందజేశారు. తోట్లవల్లూరు రోడ్డులోని అయ్యప్పస్వామి పీఠంలో ఐదు విగ్రహాల ఏర్పాటుకు విరాళం అందజేయాలని ఆలయ కమిటీ కోరడంతో ఆ మొత్తాన్ని చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో కమిటీ సభ్యులకు అందజేశానని వెంకటరెడ్డి తెలిపారు. వెంకటరెడ్డిని ఆలయ కమిటీ సత్కరించి కృతజ్ఞతలు తెలిపింది. బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, బీవీఆర్ అభిమానులు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్, నెరుసు బాలకృష్ణ పాల్గొన్నారు.



ఉయ్యూరులో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో రాజు



గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో సత్యకుమార్



పోరంకి టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అనుమోలు ప్రభాకరరావు, కుర్రా నరేంద్ర

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

● మన్యం వీరుడు సీతారామరాజుకు ఘన నివాళులర్పించిన అధికారులు, రాజకీయ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 4: దేశ స్వాతంత్రం కోసం మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని సమగ్రశిక్ష ఏపీసీ రాములనాయక్, మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు వేర్వేరు కార్యక్రమాల్లో పేర్కొన్నారు. మానవత కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. గూడపాటి జయరామచంద్రరావు, మానవత సభ్యులు పాల్గొన్నారు. రేమల్లె హైస్కూల్‌లో హెచ్‌ఎం లూథర్‌పాల్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా చిత్రపటాలకు సమగ్ర శిక్ష ఏపీసీ రాములునాయక్, ఎంఈవో సురేష్‌కుమార్, ఏఈ జయరాజు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. తర్వాత స్కూల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలికసదుపాయాలు, హాజరు, సౌకర్యవంతమైన వాతావరణం (ఇన్ఫ్రాస్ట్రక్చర్)ను ఏఈ జయరాజుతో కలిసి పరిశీలించారు. దారపురెడ్డి భాస్కరరావు, వెలమర్తి రవిబాబు పాల్గొన్నారు.

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో ఇ.సత్యకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూపరింటెండెంట్ జేవీఎస్ఆర్‌కే ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సతీష్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి కృపానందం, గోగినేని పిచ్చేశ్వరరావు, కొనసాని నాగభూషణం, అన్నే శ్రీనివాసరావు, నిమ్మగడ్డ రాంబాబు, ప్రత్తిపాటి చిన్న తదితరులు పాల్గొన్నారు.



రేమల్లె హైస్కూల్‌లో అల్లూరి, స్వామి వివేకానంద చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ రాములునాయక్

ఉయ్యూరు: ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఆర్డీవో డి.రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, సిబ్బంది నివాళులర్పించారు. ప్రధాన సెంటర్‌లో వంగవీటి శ్రీనివాసప్రసాద్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తదితరులు అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నగరపంచాయతీ కార్యాలయంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. చైర్మన్ సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరు: పోరంకి టీడీపీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకు అనుమోలు ప్రభాకరరావు, తెలుగురైతు రాష్ట్ర నాయకుడు కుర్రా నరేంద్ర, కానూరు టీడీపీ నాయకులు దోనేపూడి రవికిరణ్, వేమూరి ప్రసాద్‌లు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. కానూరు అశోక్ జిమ్ ఆవరణలో మాతృహృదయ్ స్వచ్ఛంద సేవా సంఘ్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు యార్లగడ్డ శ్రీను, తాళ్లూరి అశోక్, బాడీ బిల్డింగ్ క్రీడాకారులు అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు.

వైభవంగా తిరుప్పావడ సేవ



తాడిగడప శ్రీనివాస క్షేత్రంలో స్వామికి తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న పండితుడు

పెనమలూరు, జూలై 4: తాడిగడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామికి తిరుప్పావడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాతసేవ అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. సంప్రదాయ దుస్తుల్లో వందల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

ఉయ్యూరు, జూలై 4: నీట్ ప్రశ్నపత్రం లీకేజీని నిరసిస్తూ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం ఉయ్యూరులో విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా సంపూర్ణంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. కొన్నిచోట్ల పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూయించారు.

మహిళాశక్తికి నిదర్శనం బొబ్బా విమలాదేవి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 4: పాలసొసైటీ అధ్యక్షురాలిగా పాడిరైతు కుటుంబాలకు అండగా ఉంటూ, నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి సహకరించిన విమలాదేవి మహిళాశక్తికి నిదర్శనమని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపల్లిలో బొబ్బా విమలదేవి చిత్రపటానికి గురువారం ఆయన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాడి రంగారావు, రాజా పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 4: పెరికీడు వద్ద ఏలూరు కాలువ సమీపంలో ఒక వృద్ధుడు బుధవారం సాయంత్రం అనుమానాస్పదంగా మృతి చెందాడు. "ఎస్ఎన్ పాలేనికి చెందిన వజ్రపు సింహాచలం(65) కొన్నేళ్లుగా రైస్ మిల్లులో పనిచేస్తూ ఒంటరిగా జీవిస్తున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం పక్కనే పురుగుమందుల డబ్బా ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నాం." అని హనుమాన్‌జంక్షన్ ఏఎస్సై సుబ్బారావు తెలిపారు.

రేషన్ దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 4: చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు సకాలంలో అందాల్సిన సరుకులను పక్కదారి పట్టిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం కొత్తపల్లిలోని రేషన్ దుకాణం నెం.20లో ఆకస్మిక తనిఖీ చేశారు. 16కేజీల పంచదార, 3బియ్యం కట్టలు అధికంగా ఉన్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు. రేషన్‌దుకాణానికి వీఆర్వో రామాంజనేయులు సమక్షంలో తాత్కాలికంగా తాళాలు వేసి శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేసినట్టు వివరించారు.

ఆదర్శనీయురాలు మానికొండ సూర్యావతి

గన్నవరం, జూలై 4: కమ్యూనిస్టు ఉద్యమ నేత మానికొండ సూర్యావతి ఆదర్శనీయురాలు అని ఐద్వా జిల్లా నాయకురాలు సీహెచ్‌వీ లక్ష్మి అన్నారు. గురువారం గన్నవరంలో మానికొండ సూర్యావతి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయకుమారి, కృపావతి, దీవెనమ్మ, సామరాజ్యం, సుబ్బులు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ యనమలకుదురు వీఎల్ భవనంలో ఐద్వా ఆధ్వర్యంలో కామ్రేడ్ సూర్యవతి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యావతి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. పుసులూరి పాతాళలక్ష్మి, ఓలమ్మ, ఉప్పాడ త్రిమూర్తులు, జయలక్ష్మి, విసం రవణమ్మ, ఫాతిమా, రమ్యకృష్ణ, లావణ్య పాల్గొన్నారు.



ఉంగుటూరులో మానికొండ సూర్యావతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మహిళలను చైతన్యపరిచిన ఉద్యమకారిణి సూర్యావతి

ఉంగుటూరు: గ్రామీణ ప్రజలు, మహిళలను సంఘటితపరచి, సమస్యలపై చైతన్యపరిచి వారిలో పోరాట స్ఫూర్తిని రగిలించి, స్వాతంత్ర్య ఉద్యమం వైపు కదిలేలా చేయడంలో కమ్యూనిస్టు ఉద్యమకారిణి మానికొండ సూర్యావతి ఎనలేని కృషిచేశారని, పేదలహక్కుల సాధనకోసం ఆమె సాగించిన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు టీవీ లక్ష్మణస్వామి అన్నారు. మహిళా ఉద్యమ నాయకురాలు మానికొండ సూర్యావతి 31వ వర్ధంతిని ఉంగుటూరులో నూతనంగా నిర్మిస్తున్న సూర్యావతి శ్రామికభవనంలో నిర్వహించారు. సూర్యావతి చిత్రపటానికి నివాళులర్పించారు. అజ్మీర్ వెంకటేశ్వరరావు, షేక్ మహమ్మద్ గాలాబ్, పిల్లి రాజారావు, కృష్ణ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40



పెట్రోల్ బంకుల్లో జేసీ తనిఖీలు

చల్లపల్లి, జూలై 4 : లక్ష్మీపురం శివారు రామానగరంలోని పెట్రోల్ బంకును గురువారం జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నాణ్యత, బంకు నిర్వహణ తీరు పరిశీలించారు. కొలతలు, రీడింగ్ విధానాన్ని పరిశీలన చేశారు. తహసీల్దార్ బి.సుమతి, లీగల్ మెట్రాలజీ జిల్లా ఏసీ టి.రాజేంద్రప్రసాద్, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, డీఎస్‌వో కార్యాలయ డీటీ హేమంత్, పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు కిరణ్, గోపికృష్ణ, అమలేశ్వరరావు పాల్గొన్నారు.



రంగా జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న కొల్లు రవీంద్ర



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మంటాడలో కేక్ కట్ చేస్తున్న కుమార్‌రాజా



శ్రీకాకుళంలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసైనికులు

పేదలకు ఆరాధ్యుడు వి.ఎం.రంగా

• 77వ జయంతి వేడుకల్లో మంత్రి రవీంద్ర, ప్రజాప్రతినిధుల ఉద్ఘాటన

మచిలీపట్నం టౌన్, జూలై 4 : వంగవీటి మోహన రంగా పేద, బడుగు వర్గాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, జియాలజీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దివంగత వంగవీటి మోహన రంగా 77వ జయంతి సందర్భంగా చిలకలపూడి, రేవతీ సెంటర్‌లోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నాయకుడు కొట్టె వెంకట్రావు, రాధా రంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు, గొర్రెపాటి గోపీచంద్, కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణ ప్రసాద్, బాబాప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, కుంచే నాని, హసీంబేగ్, వాలిశెట్టి తిరుమలరావు, లంకిశెట్టి నీరజ, కొరెడ్ల సుశీల, గనిపిశెట్టి గోపాల్, జలీల్, మాదివాడ రాము, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ కానూరులో వంగవీటి రంగా విగ్రహానికి నివాళులర్పించారు. సిద్ధిరెడ్డి కొండ, జొన్నల లోకేష్, జొన్నల నాగమల్లేశ్వరరావు, గమిడి విజయ్, కనకయ్య, సందీప్, పాండు పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ కంచాకోడూరు, జొన్నల వారి మోడి గ్రామాల్లో రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. **పెడన రూరల్ :** వంగవీటి రంగా విగ్రహానికి బల్లిపర్రులో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుమల్లిలో జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, గరికపాటి వీరవెంకట్రవు, వెంకటరత్నం పాల్గొన్నారు. చెన్నూరు, చేవేంద్రపాలెం, చేవేంద్ర, శేరీవర్తర్లపల్లి గ్రామాల్లో రంగా జయంతి నిర్వహించి మిఠాయిలు పంచారు. **బంటుమిల్లి :** బంటుమిల్లి, మణిమేశ్వరం, ముంజులూరు, కంచడం తదితర గ్రామాల్లో వంగవీటి రంగా విగ్రహాలు, చిత్రపటాలకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాళులర్పించారు. భారీ ర్యాలీలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గుడివాడ :** పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటూ సమస్యలపై పోరాడిన ధీశాలి వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పండ్రాజు సాంబశివరావు ఆధ్వర్యంలో గురువారం ఏజీకే సెంటర్‌లోని రంగా విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, పాలంకి సారథిబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన, రాధా-రంగా మిత్రమండలి నాయకులు పాల్గొన్నారు. **పామర్రు :** ఉండ్రపూడిలో రంగా విగ్రహానికి నియోజకవర్గ ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పూలమాలు వేసి నివాళులర్పించారు. కూనపరెడ్డి సుబ్బారావు, సర్పంచ్ తోట పోలాక్షి, మండపాక శంకర్ బాబు, మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కొండిపర్రులో రంగా విగ్రహానికి నూకవరపు వీరాంజనేయులు, రావూరి శివయ్య, పసుపులేటి విజయకుమార్, అల్లాడ కూమారి నివాళులర్పించారు. వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి, ప్రవీణ్ చంద్ర, తాడిశెట్టి మధు, అల్లంశెట్టి సురేష్, అంజిబాబు పాల్గొన్నారు. **పెడన :** పేద ప్రజల అభ్యున్నతి కోసం రంగా విశేష కృషి జరిపారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. వంగవీటి మోహన రంగారావు 77వ జయంతి కార్యక్రమాన్ని తోటమూల, కాపుల వీధిలోని రంగా విగ్రహానికి కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, జనసేన పార్టీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, వరుదు రాము, వరుదు రామకృష్ణ, ఊసా వెంకయ్య, కమ్మగంటి బాబు, బట్టు శంకరరావు, కర్ర మోహన, ఎలిగట్ల ప్రసాద్, జల్దుల ఏడుకొండలు, బీజేపీ నాయకులు పుప్పాల రాము, గాజుల సిద్ధార్థ పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** కూరాడలో వంగవీటి రంగా విగ్రహానికి మాజీ సర్పంచ్ శాఖమూరి దుర్గా ప్రసాద్, షేక్ నాగూర్, చావా లోకేష్, ప్రసాద్, బెజవాడ రాంబాబు, సనకా నాని నివాళులర్పించారు. వడ్లమన్నాడు, విన్నకోట,పెసరమిల్లి, తదితర గ్రామాల్లో కూడా రంగా జయంతి నిర్వహించారు. వెణుతురుమిల్లిలో రంగా విగ్రహానికి సర్పంచ్ శేషవేణి నివాళులర్పించారు. **అవనిగడ్డ :** అవనిగడ్డలో రాధా - రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. రాధా - రంగా మిత్రమండలి నాయకులు యాసం చిట్టిబాబు, ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శివరావు, బచ్చు వెంకటనాథ్, లుక్కా వెంకట పిచ్చియ్య, గుడివాక శేషుబాబు, రంగా అభిమానులు పాల్గొన్నారు. **నాగాయలంక :** నాగాయలంక సెంటర్‌లో రాధా - రంగా మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజనాల మాణిక్యాలరావు రంగా విగ్రహానికి నివాళులర్పించారు. మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి చిన బాబు, పోలిశెట్టి మురారి, తోట శ్రీనివాసరావు, బండ్రెడ్డి సుబ్బారావు, బండ్రెడ్డి హరి, రేమాల బాబురావు, చిట్టా శివ నాగేశ్వరరావు, బీసాబత్తుని ప్రసాద్, సబ్బినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. **కోడూరు :** మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, జనసేన యువనేత బచ్చు వెంకటేష్ ఆధ్వర్యంలో వంతెన సెంటర్ నుంచి ఉల్లిపాలెం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో రంగా విగ్రహానికి, చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వి.కొత్తపాలెం తూర్పు వైపున అభిమానులు రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. కూటమి నేతలు ఉల్లి శేషగిరిరావు, పిల్లి మల్లిఖార్జునరావు, యాసం చిట్టిబాబు, మర్రే గంగయ్య, గుడివాక శేషుబాబు, గుడివాక శివరావు, పూతబోయిన కరుణ కుమార్, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, బడే వీరబాబు, అప్పికట్ల రవీంద్ర, వేములపల్లి రాజేష్, గోగినేని సోమశేఖరరావు, వేములపల్లి శ్రీకృష్ణ, దామెర్ల నారాయణరావు పాల్గొన్నారు. **చల్లపల్లి :** రంగా విగ్రహానికి జనసేన నేతలు అడపా రాంబాబు, రావులపల్లి పండు, గంగిశెట్టి రాజేంద్ర, బొందలపాటి వీరబాబు, అడపా రమేష్, సోమిశెట్టి రాఘవేంద్రరావు, పసుపులేటి రవి, యన్నం చంద్రయ్య, పెద్దలు జివి.తాతారావు, టీడీపీ నేత రావి చిట్టి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **ఘంటసాల :** శ్రీకాకుళంలో ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), జనసైనికులు, రాధా - రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో వంగవీటి రంగా 77వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకాకుళం, శీలంవారిపాలెం, సూరపనేనివారిపాలెం టీడీపీ, జనసైనికులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు. పూషడం గ్రామంలో సర్పంచ్ అంకం మారుతీరావు ఆధ్వర్యంలో వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **మంటాడ (పమిడిముక్కల) :** మంటాడ సెంటర్‌లో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కుమార్‌రాజా పూలమా ల వేసి నివాళులర్పించారు. జనసేన నాయకు డు తాడిశెట్టి నరేశ్ తదితరులు పాల్గొన్నారు. **కృత్తివెన్ను :** చెరుకుమిల్లిలో జరిగిన రంగా జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని రంగా విగ్రహానికి పూల మాలాలు వేసి నివాళులర్పించారు. నీలిపూడి, లక్ష్మీపురం, గాంధీనగరం, రంగా సెంటర్ తదితర గ్రామాల్లో రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.



నాగాయలంకలో రంగా జయంతి వేడుకల్లో రాధా-రంగా మిత్రమండలి



కోడూరులో రక్తదాన శిబిరం

కోడూరు : వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకుని కోడూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్సై శిరీష శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్న సాయి బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయవాడ చిగురుపాటి మంజువాణి బ్లడ్ బ్యాంక్‌కు 72 మంది రక్తదానం చేశారు. మర్రే గంగయ్య, కరుణ కుమార్, బసవయ్య, చంద్రరావు, కాగిత రామారావు, పాలడుగు ఆనందరావు, కోట రాం బాబు, కొండవీటి సునీత, జరుగు ఆదినారాయణ, ఇమ్మిడిశెట్టి వెంకట్, వినోద్, దామోదర్ పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొల్లూరి చిన్నా



అర్జునుడు జయంతి సందర్భంగా వృద్ధులకు దుస్తుల పంపిణీ

ఘనంగా రోశయ్య జయంతి

మచిలీపట్నం టౌన్ : రోశయ్య రాజనీతిజ్ఞత అందరికీ ఆదర్శమని మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. జయంతి సందర్భంగా అన్నం వీరరాఘవయ్య కళ్యాణ మండపంలో రోశయ్య చిత్రపటానికి బాబాప్రసాద్, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్‌తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో కోనేరుసెంటర్‌లో రోశయ్య జయంతి వేడుకలుజరిగాయి. వాసవీ క్లబ్ ప్రతినిధులు యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, అన్నం అశోక్, వి.కె.ఎన్. మూర్తి, జయవరపు ప్రసాద్, తమ్మన అనూరాధ, తమ్మన పవన్, మాటూరి దీప, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు. **పెడన :** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య 90వ జయంతి నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆత్మకూరి సురేష్, జల్లూరి రంగారావు, తుమ్మలపల్లి సుధీర్, భవిరిశెట్టి వీరరాఘవయ్య, పాదర్తి శ్రీను, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ పాఠశాలల్లో చిన్నారులకు స్టేషనరీని అందజేశారు. యక్కలి మణిదీప్, పట్టణాధ్యక్షులు నాగరాజు, ఆర్యవైశ్య ప్రముఖులు కొత్త వీరయ్య, కొత్త మురళీ, సాంబశివరావు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని అవనిగడ్డలో ఆర్యవైశ్య సంఘం కోశాధికారి ఘంటసాల రాజమోహన్ (కన్నయ్య) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ ఛైర్మన్ రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవికుమార్, రాజమోహన్‌లను ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య సంఘ నేతలు పాల్గొన్నారు.

బచ్చుల అర్జునుడుకు ఘననివాళి

మచిలీపట్నం టౌన్ : ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు జయంతి సందర్భంగా గురువారం ఈడేపల్లి వృద్ధాశ్రమంలో అర్జునుడు కుమారుడు బోసుబాబు ఆధ్వర్యంలో వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం చేశారు.మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. నగర టీడీపీ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, జిల్లా ప్రచార కార్యదర్శి పివిఫణికుమార్ , టీడీపీ కార్పొరేటర్ దేవరపల్లి అనిత, గోకుల శివ, కొనకళ్ళ భాను, పల్లపాటి చినబాబు, గొరిపర్తి రాము, కొనకళ్ళ భాను, బోయిన అంతర్వేది, తోట నాంచారయ్య, నీలపాల రామకృష్ణ, గంగుల నాంచారయ్య, బోయిన సత్యనారాయణ, బోయిన రమేష్, డొక్కు తాతారావు, రేవు లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

మోపిదేవి : కారు ఢీకొని మహిళ గాయపడిన ఘటన కాసానగర్ వద్ద గురువారం జరిగింది. అవనిగడ్డ పంచాయతీ శివారు సీతాయిలంకకు చెందిన మహిళ ద్విచక్ర వాహనంపై చల్లపల్లి వైపు వెళ్తుం డగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. గాయాలైన మహిళను 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మోపిదేవి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్ఫూర్తి ప్రదాతలు అల్లూరి, పింగళి



మణిమేశ్వరరంలో అల్లూరి విగ్రహానికి నేతల నివాళి



పింగళి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే కుమార్‌రాజా

మచిలీపట్నం టౌన్ : పింగళి వెంకయ్య దేశభక్తి అందరికీ ఆదర్శమని రాష్ట్ర గనులు, ఎక్సైజ్, జియాలజీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకయ్య విగ్రహానికి కొల్లు రవీంద్రతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కూచిపూడి :** పింగళి వర్ధంతిని ఆయన స్వగ్రామం భట్లపెనుమర్రు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగమనేని రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, చలసాని శాయోజీరావు, చలసాని శ్రీనివాసరావు, వీరంకి తులసీదాస్, సిహెచ్.అశోక్ కుమార్, చలసాని సుబ్బారావు తదిరతులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర, ఉపసర్పంచ్ చలసాని వెంకటరత్నం ఆధ్వర్యంలో పింగళి వర్ధంతి నిర్వహించారు. **గుడివాడ :** అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ప్రజా వేదికలో అల్లూరి చిత్రపటానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నివాళులర్పించారు. రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు. గుడివాడ క్షత్రియ సేవా సమితి, స్మారక కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి గౌరవాధ్యక్షుడు గాదిరాజు జగ్గరాజు, అధ్యక్షుడు కనుమూరి భాస్కరరాజు, సాగిరాజు ఉదయభాస్కరరాజు, కార్యదర్శి కోసూరి కామరాజు, పున్నంరాజు, రుద్రరాజు విజయకుమార్‌రాజు నివాళులర్పించారు ఏరియా ఆసుపత్రిలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సూపరిటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి, ఆసుపత్రి సిబ్బంది నివాళులర్పించారు. **పామర్రు :** తహసీల్దార్ శ్రీపల్లవి అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. డీటీ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య విగ్రహానికి సర్పంచ్ కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఫైడిపాముల స్వప్న, పి.వి.మాధవేంద్రరావు, రావి చిట్టి, మోర్ల శివ, బొం దలపాటి వీరబాబు, పిండి రేవతి, అడపా రవి, ఫైడిపాముల రాజేంద్ర, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** పెదప్రోలు లో పింగళి విగ్రహానికి గ్రామస్థులు నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ నడకుదుటి జనసీ కుమారి, ఎంపీడీవో రామలింగేశ్వరరావు నివాళులర్పించారు. నడకుదుటి జనార్ధనరావు, అరజా కిరణ్ కాంత్, తోట కృష్ణాంజనేయులు, చోడగం రాధాకృష్ణ తదితరులు ఉన్నారు. **కూచిపూడి :** అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కోసూరులో ఘనంగా నిర్వహించారు. చింతా నాగేశ్వరరాజు, బోరు కాటి నరసింహరాజు, కె.వి.అప్పారావు, కెనరసరాజు, మురాల శ్రీనివాసరావు, క్షత్రియ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** మండల పరిషత్ కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులర్పించారు. ఎంపీడీవో రెడ్డయ్య, జయరామ, విజ మకుమారి పాల్గొన్నారు. నందమూరు, మడక, ఉరివి, చెన్నూరు, నడుపూరు, నందిగామ, బల్లిపరు తదితర సచివాలయాలలో సీతారామరాజు చిత్రపటాలకు నివాళులర్పించారు. **అవనిగడ్డ :** గాంధీక్షేత్రంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి నిర్వహించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), బండే రాఘవ, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, కూనపరెడ్డి చంద్రశేఖర్, మండలి రామ్మోహన్, షేక్ బాబావలి, మొగల్ మురాద్, లుక్కా పిచ్చియ్య, మెగావత్ గోపి, కొల్లూరి వాసు, యలవర్తి చిన్నా, సామర్ల శ్రీను, తండు గంగాధరరావు, తోట రాంబాబు, పులిగడ్డ నాంచారయ్య, బచ్చు శ్రీను, కొల్లూరి ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు. **పెడన :** పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, శ్రీనుబాబు, గంగాధర్ పాల్గొన్నారు. **బంటుమిల్లి :** మణిమేశ్వరం గ్రామంలోని రాజులపేటలో అల్లూరి సతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామస్థులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




అవనిగడ్డలో...

వృద్ధులకు అన్నదానం

చల్లపల్లి : జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకుని సీయోను వృద్ధాశ్రమంలో అనాధ వృద్ధులకు అన్నదానం జరిగింది. పినిశెట్టి నిరంజన్, ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు.

పుప్పాలకు ఎమ్మెల్యే కాగిత నివాళి



కృత్తివెన్ను : నీలిపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు పుప్పాల చిట్టిబాబు దశ దిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలాలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తపరిచారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠం ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

కూచిపూడి : సిద్ధేంద్ర కళాపీఠం ప్రిన్సిపాల్‌గా శ్రీశైలం పీఠం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎం.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఓఎస్డీ నిరీక్షణ బాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ వి.రామలింగ శాస్త్రి, కళాపీఠం పర్యవేక్షకుడు పార్థసారథి, నాట్యాచార్యులు డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాస్, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, వెంకట దుర్గాభవాని, గ్రంథాలయాధికారి వైవి.ఫణికుమార్ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును సత్కరించారు.

కాకర్ల అర్జునరావు కన్నుమూత

పామర్రు : విద్యుత్ శాఖ విశ్రాంత చీఫ్ అకౌంట్సు అధికారి, రాపర్లలోని హరిహర దేవాలయ నిర్మాణ దాత కాకర్ల అర్జునరావు (85) గురువారం కన్నుమూశారు. అర్జునరావు మృతికి పముఖులు సంతాపం తెలిపారు.

కూచిపూడి నాట్యం సర్టిఫికెట్ పరీక్షలు ప్రారంభం

కూచిపూడి : కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో కూచిపూడి సర్టిఫికెట్ కోర్సుల రాత పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 28 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరిశీలకులుగా డాక్టర్ విజయ పాల్, చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ వ్యవహరించారు.

లయన్స్ అన్నదానం

గుడ్లవల్లేరు : ఎస్.ఈ.ఆర్.ఎం జూనియర్ కళాశాల విశ్రాంత ఉద్యోగిని గవిర్నేని(సజ్జా) లలిత కుమారి జ్ఞాపకార్థం కుమారుడు సజ్జా సీతారామయ్య చౌదరి, కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షులు ఎన్. శశికళ, కార్యదర్శి మేరుగు పెరుమాళ్ళు, జంగం మోహనరావు, రామకృష్ణ, పరంధామయ్య, వై.పి.సి ప్రసాద్, చాపరాల రాజేశ్వరరావు, బాలాజీ, పోలవరపు వెంకటరావు పాల్గొన్నారు.